
కథ



# చేశాక చెప్పు!

ఎ. పుష్పాంజలి

అలారం మోగడంతో టక్కున మేలుకుంది వాణి.

టైము నాలుగున్నర.

సుధాకర్ మంచి నిద్రలో ఉన్నాడు. ఈ టైములో లేవకపోతే తను ఏడింటికి బస్సందుకోలేదు. ఏడింటికి బసెక్కకపోతే ఎనిమిదింటికి ఆఫీసు చేరలేదు. రెండేళ్లుగా ఇదే టైం టేబుల్ అలవాటైంది వాణికి.

ఆమె సుధాకర్‌ని ఎప్పుడూ లేపదు, లేపినా లాభం ఉండదు గనక.

బట్టలు వాషింగ్ మిషన్లో వేసి కిచెన్ క్లీన్ చేసింది. రాత్రి పాత్రలన్నీ సింకులోనే ఉండిపోయినయ్. అవన్నీ కడిగాక హాలు, బెడ్ రూం క్లీన్ చేసింది చీపురుతో. ఉబలాటంగా వాక్యూమ్ క్లీనరు కొన్నది గానీ, దాని వల్ల ఎలాంటి ఉపయోగమూ లేదామెకు.

ఎవరైనా ఒక పనిమనిషిని పెట్టుకుందామం', ఇంత పొద్దున్నే ఎవరొస్తారు? తనొచ్చేసరికి సాయంత్రం కూడా లేటవుతుంది. ఇద్దరు, ముగ్గుర్ని, ''కనీసం సాయంత్రం చేస్తారా?'' అని అడిగితే, ''అయ్యో పిల్లలకీ, మా ఇంటాయనకి వొండిపెట్టే టైమమ్మా అదీ'' అన్నారు.

అంతో ఇంతో విశ్రాంతంటూ దొరికితే, అది ఆఫీసులోనే. ఒకే చోట కూర్చొని పనిచెయ్యొచ్చు. ఏవేళ్టి పని ఆ వేళే అయిపోతుంది. ఇంటి పని అలా కాదు. చేస్తుంటే పుట్టుకొస్తూనే ఉంటుంది. ఆఫీసులో కాఫీ తాగేటప్పుడు, కాంటీన్లో ఫ్రెండ్స్‌తో టిఫిన్ తినేటప్పుడూ బాగా రిలాక్స్ కావచ్చు-అనుకుంది వాణి.

ఇవాళ కూరలు చేయాల్సిన పనిలేదామెకు. నిన్నటి పులుసూ, పచ్చడీ, బీట్‌రూట్ వేపుడూ, అన్నీ ఫ్రిజ్‌లో ఉన్నయ్. ఈ ఫ్రిజ్జే లేకపోతే తన పని ఏంగాను?

ఆరున్నరకి కారియర్లు సర్దేసి, కాఫీ చేసి, భర్తని లేపింది. అతను కూడా ఎనిమిదింటికల్లా బస్ స్టాప్‌లో ఉండాలి. ఇద్దరి ఆఫీసులూ ఒకటి తూర్పూ, ఒకటి పడమరా. అతనికి బైక్ ఉన్నా డ్రాప్ చేయడానికి వీలు కాదు. పెట్రోలు ధర పెరగడం వల్ల, అతను వెళ్లడమూ వీలు కాదు. అందుకే ఇద్దరికీ బస్సులే ఆధారం.

ఏదైనా తినేటప్పుడూ, తాగేటప్పుడూ మాత్రం, ఆరామ్‌గా ఉండాలని కోరుకుంటుంది వాణి. ఇప్పుడామె భర్తతో కలిసి విశ్రాంతిగా కాఫీ తాగుతూంది.

'రేపాదివారం అమ్మ వస్తుందట' చెప్పాడు సుధాకర్.

'ఓ అలాగా...!' అంది వాణి, అత్తగారొస్తే తనక్కాస్త రిలీఫ్ అనుకుంటూ.

'ఏంటోయ్? చాలా ఫ్రెష్‌గా కన్పిస్తున్నావ్?' అన్నాడు

'స్నానం చేశాక ఎవరైనా ఫ్రెష్‌గా ఉంటారు' అంటూ చెప్పుల్లో కాళ్లు దూర్చింది, వెళ్లడానికి సిద్ధమౌతూ.

'ఆగాగు!' అంటూ పరుగెత్తుకొచ్చి బుగ్గ మీద ముద్దిచ్చాడు.

''చాలు బాబూ సరసాలు! బస్ మిస్సవుతుంది'' అంటూ మెట్లు దిగింది.

000

వాళ్ల పెళ్లయి రెండేళ్లయింది. అప్పటి నుంచీ ఇదే దైనందిన కార్యక్రమం. ఇద్దరూ సంపాదిస్తున్నా, మరీ పెద్ద ఉద్యోగాలు కావు కాబట్టి, సిటీలో అక్కడికక్కడికి అత్తెసరు సంపాదనలే.

సుధాకర్ తల్లి భాగ్యమ్మ, విజయవాడలో కూతురి దగ్గరుంటున్నది. అక్కడ అల్లుడు మాత్రమే ఉద్యోగి. కూతురు నలుగురు మనుషుల్ని పెట్టి చీరల మీద ఎంబ్రాయిడరీ వర్కు చేయిస్తూ బాగానే సంపాదిస్తుంది. ఎల్.కె.జి., యు.కే.జీ. చదివే పిల్ల లిద్దరున్నా రావిడకి.

ఆదివారం పొద్దుటే స్టేషన్‌కెళ్లి తల్లిని తీసుకొచ్చాడు సుధాకర్.

అవాళ భాగ్యమ్మ గుత్తొంకాయ కూర చేసింది. తను తెచ్చిన ఇంటి వడియాలు వేయించింది. వంకాయ కూర చాలానే మిగిలింది.

'ఇది ఫ్రిజ్‌లో పెట్టుకుని మైక్రోవేవ్‌లో వేడి చేసి రేపు ఆఫీసుకు పట్టుకుపోతాం' అంది వాణి.

'అయ్యో ఫ్రిజ్ కూరలెందుకమ్మా? కాలు కిలో బెండకాయలైతే పులుసు ఫ్రెష్‌గా తయారుకాదూ?' అంది భాగ్యమ్మ.

అమ్మ చెప్పింది నిజమేననిపించింది సుధాకర్‌కి.

ఉదయమనంగా వెళ్లిన కొడుకూ, కోడలూ, ఇక చీకటి పడ్డాకే రావడం. అంతవరకూ భాగ్యమ్మకు కాలక్షేపం లేదు. ఇరుగు పొరుగు అపార్ట్‌మెంట్ వాళ్లు కూడా పగలు తాళం బాపతులే. కూతురింట్లోనైతే, కూతురు గంటకోసారి లోపలికొచ్చి, కబుర్లాడి వెళ్తుంది. పిల్లలు ఒంటి గంటకంతా ఇంటికొస్తారు. కాలక్షేపాని కేమీ కొదవ లేదు.

ఎలాగో ఉగ్గబట్టి పది రోజులుంది. కానీ, ఆ పదిరోజుల్లో వాణి కాపరానికి జరగవలసినంత అపకారమే జరిగింది.

'అరే సుధా! నీకు చిన్నప్పట్నుంచీ ఫ్రిజ్ వస్తువులు తినే అలవాటే లేదు. అందుకే కాబోలు, ఆరోగ్యం చెడి చాలా నల్లబడ్డావు.'

తల్లి మాటలు విన్నాక అద్దంలో చూసుకుంటే, తను చాలా నల్లబడ్డా ననిపించిందతనికి. ఆ మాటకొస్తే అతనేం అంత ఛాయ మీరిన మనిషి కాదు.

'ఏమిటో బాబూ... ఈ మిక్సీ పచ్చళ్లూ? రుచీ పచీ లేదు. అదే టైంలో రోట్లో రెండు తిప్పులు తిప్పితే, నోటికి రుచిగా తినగలం కదా. ఇద్దరు మనుషులకి ఎంత సేపు రుబ్బాలి?'

అవున్నిజమే ననిపించింది సుధాకర్‌కు.

'అరే నాయనా నీ బట్టలన్నీ పక్కన పెట్టు. ఉతికి పెడతాను. మిషన్లో ఉతికితే కాలర్లు నల్లగానే ఉన్నట్టున్నయ్. ఏదో నేనున్న నాల్రోజులూ అలా గడవనీ... తరువాత సంగతి తరవాత...'

అంతకు ముందు వాణి మిషన్లో ఉతికిన బట్టల కాలర్లు బాగోలేక, అందరూ తనని చూసి నవ్వుతున్నా రనిపించిందతనికి.

'నేనున్నన్నాళ్లూ ఫ్రిజ్జు కూరలు చెయ్యకమ్మాయ్!' అని కోడలికి చెప్పి, తనే ఉదయం ఆరింటికల్లా లేచి, కూరలు వండటం ప్రారంభించింది భాగ్యమ్మ. లేటైపోయి నాలుగు రోజులు కేరియర్ లేకుండానే ఆఫీస్‌కెళ్లి, కాంటీన్‌లో టిఫిన్ చేసింది.

'ఏమిటో? ఈ ఇంట్లో ఓ మంగళవారం, శుక్రవారం లేదు. గురువారం సాయిబాబా రోజు. నిష్ఠగా ఉండాల్సిన రోజు. పటాలు తుడవడం, దీపం పెట్టడం చేస్తే, ఇంటికి మంచిద మ్మాయీ!' అంది వాణితో, కొడుకు వింటూండగా.

వారాలవారీగా దేవుళ్లకి పూజలు చేసే ఓపిక గానీ, టైము గానీ, వాణికి లేవు. ఆమెకి తెలిసిందల్లా, ఉదయం లేవంగానే మనసారా దేవుణ్ని తలచుకోవడం. అదే గొప్పదని ఆమె విశ్వాసం. ఐనా అత్తగారు మాట్లాడుతున్నది వింటున్నది గానీ, ఆమె ఏమీ బదులు చెప్పలేదు.

'రేపు శుక్రవారం వాణీ! రేపట్నించీ మనమూ పూజలు మొదలుపెడదాం' ఉత్సాహంగా అన్నాడు సుధాకర్.

'అలాగే మీరే ప్రారంభకులు' అంది వాణి.

'అయ్యో అదేమిటే తల్లీ? అవన్నీ ఇంటి ఇల్లాలు నిర్వహించే బాధ్యతలుట అంది భాగ్యమ్మ.

వాణి మాట్లాడలేదు.

సాధారణంగా వాణి ఇంటికి రాగానే స్నానం చేసి, హౌస్ కోట్లో దూరేసి చకచకా పనులు చేసుకుంటుంది. ఓపిక లేకపోతే రిలాక్స వుతుంది. అవాళ భాగ్యమ్మ తాలుకు బంధువులెవరో ఆమెను చూడడానికి వాళ్లింటికొచ్చారు.

'అమ్మాయ్.. ఇవాళ్టికి చీర కట్టుకో' అన్నది భాగ్యమ్మ.

అత్తగారి మాట కాదనలేక స్నానం చేసి చీర కట్టుకుంది. ఆ వచ్చినవాళ్లు భోజనాలు పూర్తయినాక, పదకొండింటి వరకూ ఉన్నారు. వాణికి కళ్లు మండుతూ, మూతలు పడసాగినయ్. శరీరం కూర్చోవడానికెంత మాత్రం సహకరించలేదు.

వాళ్లు భోంచేసిన పాత్రలన్నీ టబ్‌లో పడేసి వెళ్లి పడుకుంటున్న కోడల్ని చూసి గొణగసాగింది భాగ్యమ్మ. వాణికి చాలా చిరాకని పించింది.

'అమ్మాయ్! రేపు మే నెలకు నీ పెళ్లయి రెండేళ్లు పూర్తవడం లేదూ?' అడిగింది భాగ్యమ్మ. 'అవునండీ.' 'మరి డాక్టరుకు చూపించుకోరాదూ?' 'ఎందుకు? నాకేమైంది?' ఆశ్చర్యంగా అడుగుతున్న వాణికి, అత్తగారి మాటల్లో గూఢార్థం కాస్త నిదానంగా బోధపడ్డది. పది రోజులుందో లేదో పరుగెత్తిపోతూ ఉంది, కూతురి మీద బెంగతో. ఇక రేపు తనకొక బిడ్డ పుడితే ఈవిడ సాకుతుందన్న ఆశ ఎంత మాత్రం లేదు. సలహాలకి మాత్రం తక్కువ లేదు.

'నువ్వు మగాడివి. కాబట్టి నువ్వు ఏ పనిచేయనక్కరలేదన్న ఒక ప్రాచీనసిద్ధాంతాన్ని, ఉగ్గుపాలతో రంగరించి పోసి, సుధాకర్ని పరమ అప్రయోజకుణ్ని చేసిందీవిడ. ఈ ఆధునికయుగంలో ఆ పాత సిద్ధాంతాలకి కాలం చెల్లిందని తెలీదు' అనుకుంది.

మొన్న అత్తగారు అదీ ఇదీ సణుగుతుంటే, 'మీరుంటే అన్నీ బాగుంటాయ్ అత్తమ్మా. పోనీ మీరిక్కడే ఉండి మీ అబ్బాయి ఆరోగ్యాన్ని, నన్నూ జాగ్రత్తగా చూసుకోండి' అంది. ఆమె చెప్పబోయే సమాధానం వాణికి బాగా తెలుసు.

ఆమె ఊహించినట్టే, 'అయ్యో ఎలా వీలౌతుందమ్మా? అవతల వదినకు నేను లేకుంటే క్షణం జరగదు. అసలా పిల్లలు నన్ను చూడంది నిలవలేరు' అన్నది భాగ్యమ్మ.

హౌస్ కోట్లో దుప్పట్లోకి దూరుతున్న భార్యని చూసి, 'అబ్బా! నాకీ హౌస్ కోట్లే ఇష్టం లేదు' గోముగా అన్నాడు సుధాకర్.

'ఇష్టం లేదా? ఐతే నువ్వెప్పుడూ వేసుకోకు' నవ్వుతూ అని, నిద్రకు ఉపక్రమించింది వాణి.

000

ఆదివారం అత్తగారు వూరెళుతున్నారని, స్టేషన్‌కు వెళ్లారు దంపతులిద్దరూ.

'అమ్మాయ్! రేపు మే నెలకు నీ పెళ్లయి రెండేళ్లు పూర్తవడం లేదూ?' అడిగింది భాగ్యమ్మ.

'అవునండీ.'

'మరి డాక్టరుకు చూపించుకోరాదూ?'

'ఎందుకు? నాకేమైంది?' ఆశ్చర్యంగా అడుగుతున్న వాణికి, అత్తగారి మాటల్లో గూఢార్థం కాస్త నిదానంగా బోధపడ్డది.

పది రోజులుందో లేదో పరుగెత్తిపోతూ ఉంది, కూతురి మీద బెంగతో. ఇక రేపు తనకొక బిడ్డ పుడితే ఈవిడ సాకుతుందన్న ఆశ ఎంత మాత్రం లేదు. సలహాలకి మాత్రం తక్కువ లేదు.

నిజానికి, వాణి నాల్రోజుల క్రితమే డాక్టర్ని కలిసింది. బిడ్డల కోసం కాదు, గర్భనిరోధక మాత్రల కోసం. తమ ఆర్థికపరిస్థితి కాస్త మెరుగుపడ్డంతవరకూ, తను రెండేళ్లు లీవులో ఉన్నా, ఏ లోటూ లేకుండా ఇల్లు గడుస్తుందన్న నమ్మకం తను పొంది నంతవరకూ, తల్లి కావడం ఆమె కిష్టంలేదు.

అత్తగారి మనస్తత్వం బాగా ఎరిగివుండడంతో, తను ఆ టాబ్‌లెట్స్ వాడే విషయం ఆమెకు తెలియనివ్వలేదు వాణి.

000

అత్తగారి ప్రభావం భర్త మీద బాగానే ఉన్నట్టు, ఆమె వెళ్లి పోయాక గ్రహించింది వాణి.

'అబ్బా! కూరలు ఫ్రెష్‌గా చెయ్యరాదూ?'

'ఈవాళ శుక్రవారం, దేవుడి దీపం పెట్టరాదూ?'

'అమ్మ పాపం అన్నీ సర్దుతుండేది. ఆమె వెళ్లాక అన్నీ మామూలైపోయాయి.'

'నా కాలర్ల మురికి సరిగా వదలలేదల్లే ఉంది.'

ఈ మార్కు మాటలు, అసంతృప్తి విసుగూ మేళవించగా, సుధాకర్ నోట్లో నుంచి వినిపిస్తున్నయ్.

ఒక రోజు సాయంత్రం ఆటోవాడి సాయంతో ఒక రోలూ గూటం సహితంగా పాత్రం మోయించుకుని తెచ్చాడు సుధాకర్.

'ఇదేమిటి?' ఆశ్చర్యంగా అడిగింది.

'ఏముంది? మిక్సీ పచ్చళ్లు తిని తిని మొహం మొత్తింది. అప్పుడప్పుడూ రోటి పచ్చడి తిందాం' అన్నాడు.

'అలాగే' అంది.

000

మరుసటి రోజు ఉదయం ఆరింటికి భర్తను లేపి, 'సుధా వేరు సెనగపప్పులు వేయించా. నువ్వు కాస్త రుబ్బిపెట్టావంటే ఎంచక్కా ఇడ్లీకి రోటి పచ్చడి తిందాం' అంది.



'నేనా?'

'అవును నువ్వే. ఏముంది? పొత్రంతో నాలుగు తిప్పులు తిప్పితే సరి. గుత్తొంకాయ మసాలా కూడా వేయించాను. పనిలో పని" అంది.

''చాల్చాలు తమాషాలు! అసలివి పట్టుకోడం కూడా నాకు చేత కాదు" కోపంగా ధ్వనించింది స్వరం.

''దానిదేముంది? ఒకసారి చేస్తే అదే అలవాటై పోతుంది."

''నన్ను వంటింటికి పరిమితం చేస్తావా ఏమిటి? మా అమ్మకి తెలిసిందంటే...."

''మా అమ్మకి తెలిస్తే ఇంకా బాధపడుతుంది. యూనివర్సిటీ చదువు నుంచి డైరెక్టుగా పెళ్లి పీటల మీదికి నడిపించిందామె. వాళ్లంతా బాధపడతారని కూచుంటే, మరి రోటి పచ్చడి ఎలా తినగలం?'

''నా వల్ల కాదు. ఏమైనా చేస్కో!"

''ఓ.కే. నాకవతల పని వుంది. మిక్సీ చట్నీతో సరిపెట్టుకో."

రెండో రోజు...

''సుధా, వాషింగ్ మిషన్లో బట్టలు డ్రై అయిపోయాయి. వాటిని ఆరబెట్టు. ఆరబెట్టేటప్పుడు నీ కాలర్ల మురికి పోయిందో లేదో చూసుకో. ఒక వేళ మురికిపోకుంటే సబ్బుతో రబ్ చెయ్యి."

వాషింగ్ మిషన్లో బట్టలు ఉతికితే కాలర్లకి మురికి ఎంత మాత్రం మిగలదని వాణి బాగా తెలుసు. ఇంటి పనిలో అతని బాధ్యత గుర్తుచేయాలని మాత్రమే అతనికి పనులు పురమాయించడం మొదలెట్టింది.

అతను సణుగుతూ గొణుగుతూ బట్టలారబెట్టాడు.

వాణి పట్టించుకోలేదు.

''చెయ్యి తీరడం లేదు. కాస్త టీ పెట్టుకో. హెల్ప్ యువర్ సెల్ఫ్' కూరగాయలు తరుగుతూ చెప్పింది.

''ఒక పనిమనిషిని పెట్టుకో. ఇక మీదట నాకే పనులు చెప్పకు!" ఘాటుగా వచ్చింది జవాబు.

''ఈ పనులు ఇంత పొద్దున్నే ఎవరూ చేయరు, ఒక ఆల్ ఇన్ వన్ మిషను తప్ప!"

''ఐతే నేన్నిన్ను మిషన్లా చూస్తున్నానా?"

''అది అడగాలా?"

''నీకు మతిపోయింది!"

''నువ్వు గతి తప్పావు. మీ అమ్మ వచ్చిన్నాటి నుంచీ..."

మాటా మాటా పెరిగి, వాణి సూట్ కేస్ సర్దుకుని, వర్కింగ్ వుమన్స్ హాస్టల్‌కి వెళ్లిపోయింది.

000

మొదట్లో, ''పోతే పోనీ! మా అమ్మను పిలిపించుకుంటాను" అనుకున్నాడు, సుధాకర్ బెట్టుగా.

తల్లికి ఫోన్ చేస్తే, ''అయ్యో నాయనా, నాకెలా వీలవుతుంది? పిల్లలిద్దరికీ పరీక్షలు. అసలే ఎల్.కె.జీ., యూ.కే.జీ." చెప్పిందావిడ.

ఉక్రోషంగా వాక్యూమ్ క్లీనర్ తీశాడు. దాన్ని అటూ, ఇటూ తిప్పేసరికల్లా భుజాలు, నడుమూ నొప్పెట్టాయి. అంతే గానీ, కసువంతా ఎక్కడిదక్కడే.

పక్కింటి ఆంటీ నడిగి నాల్రోజులు వాళ్ల పనిమనిషిని పంపమని రిక్వెస్ట్ చేశాడు.

ఒక రోజు అతను ఏడున్నరకి తాళం వేస్తోండగా, పనిమనిషి ఎదురొస్తూ కనిపించింది.

రెండోరోజు సాయంత్రం వచ్చింది. ఇంట్లో వంట లేదు కాబట్టి, అంట్లు ఏమీ లేవు. కసువూడ్చి, ఇల్లు తుడిచి వెళ్లి పోయింది.

మూడో రోజు ఐదున్నరకే కాలింగ్ బెల్ మోగితే, ఎవరా అని తలుపు తీశాడు.

ఎదురుగా పనిమనిషి!

ఆఫీస్‌కు వెళ్తూ తన వాచ్ కోసం ఫ్రిజ్ మీద చూశాడు. కనబడలేదు. బాగా వెదికి అదింక లేదని నిర్ధారించుకున్నాక, ఆ పనిమనిషిని మాన్పించేశాడు.

అతడికి హోటల్ భోజనం సరిపడక అమీబియాసిస్ పట్టుకుంది. నీరసంగాఉంది.

'అసలీ పనంతా వాణి ఎలా చేసేది? ఆటంబాంబూ, కంప్యూటర్ కనిపెట్టినవాడి కన్నా, సరిగ్గా ఇంటిపని చేసేవాడు మహామేధావి' అనుకున్నాడు.

అతని ఈగో స్వేదరూపంలో కరిగి ప్రవహించింది.

ఇరవై రోజులకు అతనికి జీవితం మీద విరక్తి పుట్టింది.

వాణికి ఫోన్ చేసి ''ఏం తల్లీ, నువ్వొస్తావా, నన్ను రమ్మంటావా?" అన్నాడు.

''నువ్వు రానక్కర్లేదు. నేనే ఆటోలో వస్తా" నవ్వుకుంటూ చెప్పింది వాణి.

''ఇదో చెంపలేసుకుంటున్నాను. ఫోన్‌లో వినపడుతోందా?"

''అంతా అబద్ధం! సొరకాయలు కోయడం బాగా నేర్చుకున్నావు."

000

''వాణీ! ఆ గుత్తొంకాయ మసాలా ఇలా పడెయ్, రోట్లో రుబ్బిచ్చేస్తా."

''నీ వల్ల కాదులే. మిక్సీలో వేస్తా..." ఇల్లు సర్దుతూ చెప్పింది వాణి.

"ఏం పరవాలేదు. అదేం బ్రహ్మవిద్యా? రెండు తిప్పులు తిప్పితే అదే ప్రాక్టీసవుతుంది" అన్నాడు, రోలు దగ్గర కూచుంటూ.

''రుబ్బడం అంత సులభం కాదు. ఏదైనా... చేశాక చెప్పు!" నవ్వుతూ అంది వాణి.